# అమ్మతనం

కూతురు లక్ష్మి కొడుకు శ్రీనుతో ఆటో దిగుతోంది. కుమారి ఆనందంగా వాళ్లకి ఎదురెళ్లింది. శ్రీను 'అమ్మమ్మా' అంటూ కుమారిని కౌగలించుకున్నాడు.

ఆటోవాడికి లక్ష్మి వంద రూపాయల నోటిస్తుంటే చిల్లర లేదంటున్నాడు ఆటోడ్రైవర్.

"నేనిస్తానుండవే తల్లీ" అంటూ కుమారి లోపలికి వెళ్లి పాతిక రూపాయలు తీసుకొచ్చి ఆటోవాడికిచ్చింది.

"ఎప్పుడు బయల్దేరారే! భోజనాలు చేసారా! వంట చెయ్యనా? ఆప్యాయంగా అడిగింది కుమారి.

"ఎక్కడి భోజనమమ్మా! శ్రీనుకి ఈరోజు స్కూలు లేదు. ఆయనకి వంటచేసి పంపేసి ఇలా వచ్చేసాను... నీతో కలసి భోంచేద్దా



మని" అంది లక్ష్మి.

లక్ష్మి విజయవాడ సత్యనారాయణపురంలో ఉంటుంది. ఆమె తల్లి కుమారి విద్యాధరపురం లో ఉంటుంది. లక్ష్మి భర్త సురేష్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు.

"మంచిపని చేశావు లక్ష్మీ... ఎంతసేపు? చిటికెలో వంట చేసెయ్యనూ!" గ్యాస్ స్టవ్ వెలిగిస్తూ అంది కుమారి.

"ఏం కూర వండుకున్నావమ్మా?" కాళ్లు కడుక్కొని వచ్చి మంచంపై కూర్చుంటూ అడిగింది లక్ష్మి.

"మామిడికాయపప్పు, దొండకాయ పచ్చడి" బియ్యం కడుగుతూ ఆప్యాయంగా లక్ష్మి వైపు చూస్తూ అంది కుమారి.

లక్ష్మి కొడుకు శ్రీనుతో కలిసి భోజనానికి కూర్చుంది. మామిడికాయపప్పు, దొండకాయ పచ్చడి మొత్తం లక్ష్మికి, మనవడికీ వడ్డించింది కుమారి. తను ఆవకాయ వేసుకొని భోజనం ముగించింది.

భోజనాలు అయ్యాక తల్లి పళ్లాలు తీస్తూంటే అప్పుడంది లక్ష్మి చెయ్యి తుడుచుకుని మంచంపై కూర్చుంటూ... "ఏంటమ్మా! నువ్వసలు పప్పు, పచ్చడి వేసుకోనేలేదు, పచ్చడి మెతుకులు తిన్నావు.

ఆ మాటలకు తల్లి మనసు అర్ధమయ్యింది.

"చాల్లే ఊరుకోవే! ఎప్పుడూ తినడం లేదా ఏమిటి? అంది నవ్వేస్తూ. మరి కూతురు మాత్రం అక్కడ భర్తతో అన్నీ తినడం లేదేమిటి? అనుకోలేదా అనురాగమూర్తి.

సాయంత్రం వరకూ ఉండి, తల్లిచేత ఉల్లిపాయల పకోడిలు వేయించుకుని తిని, శ్రీనుతో బయలుదేరి బస్టాప్ కేసి నడిచింది లక్ష్మి.

# కె. నాగేశ్వరరావు

ఇంటికి వెళ్లగానే శ్రీను తండ్రితో చెప్పాడు "డాడీ! మేము వెళ్లేటప్పుడు ఆటోలో వెళ్లాం..." అని.

పాతిక రూపాయలు తగలేసి ఆటోలో ఎందుకే..? భార్యపై ముద్దుగా విసుక్కున్నాడు సురేష్.

"మా అమ్మ ఇచ్చింది లెండి" విసురుగా అంది లక్ష్మి.

"మీ అమ్మ డబ్బులు మాత్రం డబ్బులు కావా? ఆమెకు మాత్రం ఎక్కడ నుండి వస్తాయే చెప్పు?"

"మీరు ఊరికే మా అమ్మ మీద జాలిపడి, ఆమెను లేనిదాన్ని చెయ్యకండి. నేను కాస్త అక్కడ ఎంజాయ్ చెయ్యాలనుకుంటూంటే..." విసుక్కుంటూ వంటగదిలోకి వెళ్లింది లక్ష్మి.

నిట్టూరుస్తూ కుర్చీలో కూలబడ్డాడు సురేష్. వంటగదిలోంచి బయటకు వచ్చిన లక్ష్మి "ఏమండీ మనకి త్వరలో పాతిక వేలు వస్తాయి. మా అమ్మ నుంచి... తెలుసా? అంది గర్వంగా తలెగరేస్తూ.

"మనకిచ్చేదేదో ఇచ్చేసారు కదా! ఆ డబ్బుపై మనకెందుకు ఆశ? రేపు ఆవిడకి అనారోగ్యం వచ్చినా, మరే అవసరం వచ్చినా ఉండాలి కదా! పైగా అది ఆవిడ సొమ్ము. ఆవిడిష్టం. మనకి హక్కు లేదు" అన్నాడు భార్య అత్యాశ తెలిసిన సురేష్ మెల్లగా.

"ఆవిడ మాకివ్వక ఏం చేసుకుంటుంది? మీవన్నీ వితండ వాదనలు, లోక విరుద్దపు ఆలోచనలూ..." అని భర్తపై చిరాకు పడింది లక్ష్మి.

లక్ష్మి తండ్రి బియ్యం వ్యాపారం చేస్తూ ఇటీ

వలే చనిపోయాడు. ఇద్దరాడపిల్లలకి పెళ్లి, పేరంటాలకు చాలా ఖర్చయింది. స్వంత ఇల్లు కూడా లేదు. అప్పులు పోను కుమారికి భర్త వల్ల దక్కిన మొత్తంలో లక్షరూపాయలే మిగి లాయి. వాటినే ఇంటి ఓనరు రాజుగారి ద్వారా వడ్డీకిచ్చి, వచ్చిన వడ్డీతో జీవనం సాగిస్తోంది ఆమె.

ఉగాది దగ్గర పడింది. సురేష్ సంక్రాంతికి రెండు చీరలు కొంటూ, ఉగాదికింక అడగొద్దని చెప్పేసాడు భార్య లక్ష్మికి. కాని లక్ష్మి కొత్త చీరలు రెండూ కట్టేసుకుంది. పండక్కి కొత్తచీర కొను క్కోవాలనుందామెకి. భర్తని నోరు తెరిచి అడిగిం దా... ఫ్యామిలీ బడ్జెట్ రామాయణం అంతా విప్పి తల బొప్పి కట్టిస్తాడు. ఏం చెయ్యాలి? అమ్మనడిగితే...?

ఆ ఆలోచన మెరుపులా ఆమె శరీరమంతా ప్రవహించి చురుకుతనాన్ని తెచ్చింది. భర్తని కాలేజీకి, శ్రీనుని స్కూల్‌కి పంపి, చకచకా తల్లి దగ్గరికి బయలుదేరింది.

లక్ష్మి తల్లి ఇంటికి వెళ్లేసరికి కుమారి ఇరుగు పొరుగు వారితో కలసి దుర్గగుడికి బయలుదేరు తూ లక్ష్మిని చూస్తూనే 'రామ్మా' అంది అభిమా నంగా.

ఎక్కడికి బయలుదేరావ్? అంది లక్ష్మి మొ హం మాడ్చుకుంటూ.

ఆ మాత్రానికే తల్లి మనసు విలవిల్లాడింది.

"ఏమర్రా! నేను గుడికి రానుగానీ మీరు వెళ్లండి" అంది కుమారి వారితో.

"ఊళ్లో ఉండే కూతురే కదా! మళ్లీ వస్తుం దిలే లేకపోతే తనని కూడా రమ్మను వెళ్లి వద్దాం" ప్రేమగా కోప్పడింది ఇంటిగలావిడ సుబ్బమ్మ.

'వద్దులే వదినా! మీరు వెళ్లిరండి' అంటూ ఇంటి తాళం తీసింది కుమారి.

తల్లితో ఒక గంట కబుర్లు చెప్పి, అసలు విషయానికొచ్చింది లక్ష్మి. "అమ్మా! పండక్కి నాకు కొత్త చీర లేదే...! మీ అల్లుడేమో మీ అమ్మగారు ఆ మాత్రం కొనివ్వరా అంటున్నారే" అని అబద్ధం చెప్పి భర్తని చెడ్డవాణ్ణి చేసేసింది.

"అయ్యో! అలా అన్నారా అల్లుడుగారు? సరే...! బిడ్డకి చీర కొనిపెట్టలేనా? మీ నాన్న గారు లేకపోయినా ఆయన డబ్బుంది. నేనున్నా ను. తప్పకుండా ఇస్తాను. చీర కొనుక్కో అమ్మా" అంటూ ఆత్రపడింది కుమారి.

ఎప్పుడైనా అత్యవసరానికుంటాయని దాచి ఉంచిన అయిదు వందలూ తెచ్చి కూతురికిచ్చిం ది. అందుకున్న లక్ష్మి మొహంలో కొండంత వెలుతురొచ్చింది. అది చూసిన కుమారి కళ్లు చెమ్మగిల్లాయి.

తల్లి దగ్గరకి వెళ్లొచ్చానని తెలిస్తే "అడిగి తెచ్చుకున్నావా?" అని భర్త తిడతాడని గ్రహించి, ఎవరిచేతనో అమ్మ పంపిందని చెప్పి ఆ డబ్బు భర్తకు చూపించి, చీర కొనుక్కుంది లక్ష్మి.

మర్నాడు చిన్న కూతురు శిరీష వచ్చింది. ఆమె రవీంద్రభారతి స్కూల్లో టీచర్‌గా చేస్తోంది. వస్తూనే చెప్పింది... "అమ్మా! నేను డెలివరీకి ఒక నెల ముందుగానే వచ్చేస్తానమ్మా! అక్కడ ఉమ్మడి సంసారంలో కష్టంగా ఉందే" అంటూ బాధపడింది.

శిరీష సింగ్‌నగర్‌లో ఉంటుంది. బి.ఎస్‌సి., బి.ఇడి. చేసి సత్యనారాయణపురంలోని రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్లో సైన్స్ టీచర్‌గా పనిచేస్తోం ది. భర్త కుమార్ ఆంధ్రాబ్యాంక్‌లో క్లర్కు.

ఏదో గర్భవతివి కాబట్టి పని చేయలేకపోతు న్నావు. ఆ మాత్రానికే మీ అత్తయ్య అలా బాధప డలా? వచ్చేయమ్మా... వచ్చెయ్యి. నేను చూసు

కుంటాను" తల్లి పేగు సానుభూతితో స్పందించింది. ఆనందంగా వెళ్లిపోయింది శిరీష.

ఇంటికి వెళ్లిన తర్వాత భర్త కుమార్‌కి విషయం చెప్పింది శిరీష. "ఇప్పటి నుండీ ఆవిడ నెత్తిమీద కూర్చుని బాధపెట్టడం దేనికి? డెలివరీ టైమ్‌కి వెళ్లచ్చులే" అన్నాడతను. మెల్లగా కొంతసేపటికి భర్తని ఒప్పించింది. చివరికతను "సరే... వెళ్తే వెళ్లుగానీ ఖర్చులకు మన డబ్బే వాడు. ఆవిడని ఇబ్బంది పెట్టకు" అన్నాడు.

మరుసటి రోజు లగేజితో సహా దిగిన శిరీషని అక్కున చేర్చుకుంది కుమారి. 'ఏదో ఈ కానుపు కాస్తా ముగిస్తే సరిపోతుంది. పై వాడి పిలుపు కోసం చూడడం తప్ప ఇంకేం ఉంది నాకు?' అనుకుని సంతోషంగా బాధ్యత స్వీకరించింది.

శిరీష హాయిగా ఉదయం ఎనిమిది గంటలు దాటాక నిద్ర లేచి తయారై స్కూలుకి వెళుతోంది. అప్పటికి వంటచేసి శిరీషకు వేడి వేడి అన్నం పెడుతుంది కుమారి.

శిరీష స్కూలుకెళ్లిన తర్వాత కడుపుతో ఉన్న పిల్ల... అనుకుంటూ ప్రతిరోజూ ఏదో ఒక వంటకం తయారుచేసి రెడీగా పెడుతుంది. శిరీష రాగానే టిఫిన్ పెట్టి, స్నానానికి వేడినీళ్లు పెట్టి, చివర్న శిరీష నిద్రపోయే సమయానికి పాలల్లో కుంకుమ పూవు కలిపి గ్లాసు నిండా పాలు యిస్తుంది.

పాలవాడు పాలుపోస్తూ "ఎక్కువ తీసుకుంటున్నారు. అన్నీ రాసి పెట్టమ్మా" అన్నాడు.

'ఈ ఖర్చులన్నింటికీ చాలానే డబ్బు అవసరం పడొచ్చు. ఈ సొమ్ము అసలు లక్ష రూపాయలనుంచి తీసి ఖర్చు పెట్టాలి తప్పదు' అనుకుని నిట్టూర్చింది కుమారి.

శిరీషకు డెలివరీ అయింది. ఆడపిల్ల పుట్టింది. ట్యూబెక్టమీ కూడా చేయించింది కుమారి. ఒకరి కంటే ఎక్కువ పిల్లలు వద్దని శిరీష ముందుగానే తల్లికి చెప్పింది డెలివరీ అవగానే ఆపరేషన్ చేయించమని.

పాపను చూడడానికి శిరీష భర్త కుమార్ హాస్పటల్‌కి వస్తున్నాడు. కుమారి ఒకరోజు క్యారియర్ తేవడానికి ఇంటికి కెళ్లిన సమయంలో కుమార్ అయిదువేలు తీసి భార్య కిచ్చాడు. "హాస్పటల్ బిల్లు, మిగిలిన ఖర్చులూ చూసుకో..." అన్నాడు.

"ఈ డబ్బుతో పాపకి చెయిన్ కొంటాను" అంది శిరీష.

"అదేమిటి? ఈ ఖర్చంతా మీ అమ్మ నెత్తిన వేస్తావా?" అన్నాడు కుమార్.

"ఏం...? అక్కకి రెండు డెలివరీల ఖర్చు అమ్మ పెట్టలేదా? నాకెందుకు పెట్టదు?" అసహనంగా అంది శిరీష .

మీ అక్క ఉద్యోగస్థురాలు కాదు. నువ్వు సంపాదించుకునే దానివి. నీ ఖర్చు నువ్వు పెట్టుకోవడం సబబుగా ఉంటుంది" అనునయంగా అన్నాడు కుమార్.

"నేను కష్టపడి ఉద్యోగం చేసుకుంటున్నాను. సంపాదించుకుంటున్నాను. అలా అని అమ్మా నాన్నల డబ్బులో వాటా ఎందుకు వదులుకోవాలి?" ఖరాఖండిగా అంది... భర్త ఇచ్చిన డబ్బు దాచుకుంటూ.

"పాపమే! ఆమెను పీక్కుతిన్నట్టుగా ఉంటుందే నాకు..." అన్నాడు కుమార్.

"అయినా మీకెందుకండీ ఈ విషయాలు? ఆమె బాధ్యత కాబట్టి చూస్తుంది, ఖర్చు పెడుతుంది" అంది భర్త మనసులో కలిగిన సానుభూతి పవనాన్ని ఎగరగొడుతూ శిరీష.

హాస్పిటల్ బిల్ కట్టి తల్లిని, బిడ్డనీ ఇంటికి తీసుకొచ్చింది కుమారి. నాలుగు రోజులు అయ్యాక మెల్లగా అంది శిరీష తల్లితో... "అమ్మా! పాపకి ఒక చెయిన్ కొంటే బావుంటుందేమోనే!"

"అవునమ్మా! నిజమే! కానీ ఇప్పటికే పది వేలయింది. ఆ సొమ్ము అసలు సొమ్ము లక్ష రూపాయల్నుంచి తీసేసి ఖర్చుపెట్టాను. రేపటి నుంచి నాకు నెలనెలా వచ్చే వడ్డీ తగ్గిపోతుంది. ఇప్పుడే నాకు బొటాబొటీగా సరిపోతోంది. అందుకే ఆలోచిస్తున్నాను తల్లీ! అంతకంటే ఏంలేదు. ఆడపిల్లకి బంగారం పెడితే బాగానే ఉంటుందమ్మా" తల్లి మనసు బాధతో విలవిలలాడింది.

"చదివించి, ఉద్యోగస్థురాల్ని చేసి పెళ్లి చేసి నా కూతురింకా తల్లి పెట్టుపోతలనాశించే హీనస్థితిలో ఉందేమిటా?" అన్న ఆలోచన కలగలేదా బంగారుతల్లికి.

అందుకే నేనే ఒక కాసు బంగారం కొనుక్కుని నువ్విచ్చావని చెబుతానమ్మా మా అత్తగారితో" అంది శిరీష మెల్లగా విషయానికొస్తూ.

"మా అమ్మే! మా బంగారుతల్లే! ఎంత పెద్ద మనసే నీది" కూతుర్ని ఆప్యాయంగా హత్తుకుంది కుమారి. పాపకు మూడు నెలలు నిండాక అత్తగారింటికి వెళ్లింది శిరీష.

మొత్తం ఖర్చు ఇరవై వేలు అయింది శిరీష వచ్చిన దగ్గర్నుంచి వెళ్లేంతవరకూ. 'మిగిలిన ఎనభై వేల రూపాయల మీద వచ్చే వడ్డీతో ఎలా బ్రతకాలా' అని ఆలోచిస్తూ ఉండిపోయింది కుమారి.


మూడు నెలల నుంచి కూతురికి, మనవరాలికీ సేవలు చేసి చేసి నీరసపడిపోయింది కుమారి. ఒక రోజు నీరసం తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయింది. సుబ్బమ్మగారు, ఆమె భర్త కలిసి డాక్టరు దగ్గరికి తీసుకువెళ్లారు. బలమైన తిండి, విశ్రాంతి ఉంటే సరిపోతుందంటూ డాక్టర్ మందులు రాసిచ్చాడు. దానికి అయిదు వందలైంది. 'మళ్లీ ఇదో ఖర్చు' నీరసంగా అనుకుంది.

సుబ్బమ్మ భర్త రాజుగారు సహృదయుడు. సంవత్సరం క్రితం ఆ చిన్న పోర్షన్ అద్దెకు కావాలని వచ్చిన కుమారిని చూడగానే ఆయన కెందుకో ఆమెపై సోదర వాత్సల్యం కలిగింది. కుమారి సమాచారం అంతా భార్య నుంచి వింటూ నిశ్శబ్దంగా ఆమె జీవనాన్ని గమనిస్తూ ఉంటారాయన.

కుమారి భర్త లేక ఒంటరిగా పొదుపుగా బ్రతకటమూ, కూతుళ్లిద్దర్నీ చక్కగా చూసుకోవటమూ ఆయనకు ముచ్చట కలిగిస్తున్నది. కానీ ఒకరకంగా కూతుళ్లిద్దరూ తమ స్వార్థ ప్రయోజనాలకే ఎప్పుడూ తల్లిని ఉపయోగించుకుంటారు తప్ప అంతగా తల్లిని ఆదరించరేమో అన్న భావమూ అప్పుడప్పుడూ కలుగుతుంటూందాయనకు. పెద్దకూతురు వస్తూ పోతూ ఉండడమూ, తర్వాత చిన్న కూతురు రావడమూ, వెళ్లడమూ కుమారి పడుతున్న శ్రమ, అయిన ఖర్చూ ఆయనకి కాస్త బాధనే కలిగించాయి.

ఆడపిల్లలు తేలిగ్గా తల్లిపై ఆధారపడుతూ ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా ఆమెను పీల్చి పిప్పిచేయడం తమ హక్కుగా భావించడం ఆయనకు కోపాన్ని తెప్పించింది. 'ఆడపిల్లలే తల్లిని అర్థంచేసుకుని ఆదరణ చూపకపోతే... ఇక మగపిల్లలేం చూస్తారు?' అనిపించిందాయనకి.

ఆ రాత్రి ఆయన కుమారి దయనీయస్థితిని మరీ మరీ తలుచుకున్నారు. ఆయన గుండె జాలితో నిండిపోయింది. మర్నాడు ఆలస్యంగా నిద్రలేచిన రాజుగారికి కుమారి, ఆమె పెద్ద




కూతురు లక్ష్మి గేటు దగ్గర మాట్లాడుకోవడం కన్పించింది.

“ఏంటమ్మా! ఇంత నీరసంగా ఉన్నావ్? నాకు కబురు చెయ్యొద్దా!” గద్గదస్వరంతో అడుగుతోంది కుమారిని లక్ష్మి. బహుశా తల్లిని తీసుకెళ్లడానికి వచ్చినట్టుంది. మంచిపని చేస్తోంది. తల్లిని తమ దగ్గరపెట్టుకొని బిడ్డలా చూసుకోవాలి. అదే కూతుళ్ల బాధ్యత. ఎంతయినా తల్లికి బిడ్డే తల్లవుతుంది. లక్ష్మి మంచిపిల్ల. పెద్దది కదా! పెద్ద మనసుతో వచ్చినట్టుంది. తనే ఆడపిల్లల మీద దురభిప్రాయం ఏర్పరచుకున్నాడు. తన అభిప్రాయం తప్పని నిరూపించబడటం రాజుగారికి ఆనందాన్నే కలిగించింది.

అరగంట తర్వాత భార్య సుబ్బమ్మ వార్త తీసుకొచ్చింది. “కుమారి పెద్ద కూతురు లక్ష్మి కొడుకుని తీసుకొని వేసవి సెలవులకని వచ్చిందట. నెలరోజులపైనే ఉంటుందట. లక్ష్మికి కాస్త నీరసంగా ఉంటోందట. తల్లి దగ్గరుండి రెస్ట్ తీసుకోవాలని అనుకుంటోందట” ఆ విషయం విన్న రాజుగారు ‘హతోస్మి’ అనుకున్నారు.

కూరగాయలు తేవడానికి రైతుబజారుకి బయలుదేరిన కుమారిని చూశారాయన. సన్నటి నీటిపొర కమ్మిందాయన కళ్లల్లో. వెళ్తున్న కుమారివైపే చూస్తూ నిలబడ్డారాయన.

స్త్రీ నేడు లింగపరంగా సమాజం చూపుతున్న వివక్షని ఎదుర్కొంటోంది. ఆడతనాన్ని పురుషుడు రకరకాలుగా దోచుకోవడాన్ని గుర్తిస్తోంది. ఆ దోపిడీకి ఎదురుతిరిగి పోరాటం సాగిస్తూ ముందుకు పోతోంది. అయితే నేడు అమ్మతనం వల్ల కూడా తాను దోపిడీకి, పీడనకూ గురవుతున్నానన్న విషయాన్ని ఆమె గుర్తించడంలేదు. రేపటి తల్లులూ గమనించడం లేదు.

స్త్రీకి అమ్మతనం ఒక శాపంగా మారినప్పుడు, ఆవిషయాన్ని ఆమె గ్రహించకపోవడం ఒకింత అదృష్టమేనేమో? అది స్త్రీ పాలిట వరమేమో...? ●